# అధ్యాయము 23

# శారా మరణం

23వ అధ్యాయము శారా మరణమును, తరువాత ఆమెను భూస్థాపన చేయుటకు అబ్రాహాము అనుకూలమైన శ్మశానభూమిని వెదకుటను తెలియజేస్తుంది. హెబ్రోనులో హేతు కుమారులతో చర్చించిన తరువాత, మక్పేలా గుహను సంపాదించి, వాగ్దాన భూమిలో తన ప్రియమైన భార్యను పాతిపెట్టెను.

## శారా మరణము మరియు అబ్రాహాము అంగలార్పు (23:1, 2)

**[1]శారా జీవించిన కాలము, అనగా శారా బ్రతికిన యేండ్లు నూట ఇరువది యేడు.**
**[2]శారా కనాను దేశమందలి హెబ్రోనను కిర్యతర్బాలో మృతిబొందెను; అప్పుడు అబ్రాహాము శారా నిమిత్తము అంగలార్చుటకును ఆమెను గూర్చి యేడ్చుటకును వచ్చెను.**

**వచనము 1.** ఆదికాండ వివరణ **శారా జీవిత** చివరి దినాలను గురించి చాలా తక్కువ సమాచారం ఇచ్చినప్పటికీ, చారిత్రక వివరణలో ఆమె గొప్ప స్థానమును పొందుకుంది. ఆమె జీవిత కాల వ్యవధిని భద్రపరచుట ద్వారా బైబిల్ రచయితలు ఘనపరచిన ఏకైక బైబిల్ స్త్రీ శారా. ఇస్సాకు పుట్టినప్పుడు ఈమెకు తొంబై యేండ్లు (17:17; 21:1, 2) మరియు హాగరును మరియు ఇష్మాయేలును వెళ్లగొట్టమని అబ్రాహాముకు చెప్పినప్పుడు తొంబై మూడు యేండ్లు (21:8–10). ఆమె చివరి ముప్పై నాలుగు సంవత్సరాలు వివరించకుండా శారా **నూట ఇరువది యేడు యేండ్లు** వయస్సులో మరణించింది అని రచయిత నమోదు చేసాడు. మరోవైపు, అబ్రాహాము జీవితముతో కూడా ఈ విధంగానే వ్యవహరించబడింది. తను భూలోకంలో నివసిస్తున్న చివరి ముప్పై ఎనిమిది సంవత్సరాలలో కేవలం రెండు సంఘటనలు మాత్రమే నమోదు చేయబడినవి: ఇస్సాకు కొరకు భార్యను ఎన్నుకొనుట (24:1–67) మరియు కెతూరాతో అబ్రాహాము వివాహము (25:1–10). అయితే, తరువాత సంఘటన యొక్క కాలక్రమణిక అనిశ్చియంగా ఉన్నది (25:1 పై వ్యాఖ్యలు చూడండి).

**వచనము 2. శారా మరణించిన** స్థలము పేరు **కిర్యతర్బా** అంటే అక్షరార్ధంగా

"నాలుగురి నగరం." ఈ సందర్భంలో నగర ప్రాముఖ్యతను గూర్చి చాలా సలహాలు ఇవ్వబడినవి. రెండు ఆసక్తికరమైన సాధ్యతలు ఏమిటంటే: (1) "నాలుగురి నగరంలో పావువంతును హిత్తీయులు ఆక్రమించిన"[1] ఒక నగరం ఇది. (2) రెండవ ఎంపిక, దీని సాధ్యత ఎక్కువగా ఉంది, ఈ పేరు ఆ ప్రాంతంలోని నాలుగు కుటుంబాల స్థావరాల సమాఖ్యను (సేవకులు/బానిసలు మరియు వారి కుటుంబాలతో సహా) సూచిస్తుంది: ఆనేరు, ఎష్కోలు, మమ్రే మరియు హెబ్రోను (14:13 చూడండి).[2] కాలక్రమేణా, హెబ్రోను ఆ ప్రాంతంలో ఆధిపత్య నగరమైనది ఎందుకంటే ప్రధమంగా నివసించిన కుటుంబాలు వారి గొర్రెలు మరియు పశువులతో ఇతర ప్రదేశాలకు తరలించబడిరి. మరోవైపు, కొన్ని కుటుంబాలు, లోతు వలే (13:12; 14:12), గొర్రెలను మరియు పశువులను జాగ్రత్తగా చూచుటకు వారి అధిక భాగమైన పరివారమును గ్రామీణ ప్రాంతాలలో విడిచి వారు హెబ్రోనుకు తరలియుండవచ్చు. ఈ వివరణ వ్రాయబడిన సమయానికి, "కిర్యతర్బా" అనునది **హెబ్రోనుకు** మునుపటి పేరు అని వ్యాఖ్యాత తన ఇశ్రాయేలీ ప్రేక్షకులకు వివరించవలసివచ్చినది (యెహోషువ 14:15; న్యాయాధి. 1:10). అది **కనాను దేశములో** ఉన్నదని కూడా అతడు గుర్తించాడు.

**అబ్రాహాము శారా నిమిత్తము అంగలార్చుటకును ఆమెను గూర్చి యేడ్చుటకును వచ్చెను** అని పేర్కొనబడింది, అంటే ఆమె దేహమునుంచిన గుడారములోకి అతడు ప్రవేశించాడు. పురాతన కాలంలో శవం దగ్గర సంతాప ఆచారములు జరిగేవి మరియు బిగ్గరగా ఏడ్చుట, వస్త్రములను చింపుకొనుట, మురికిలో కూర్చొనుట లేదా వాటిని ఒకరి తలపై చల్లుకొనుట, గోనెపట్ట ధరించుట మరియు ఉపవాసము దానిలో ఉండేవి (2 సమూ. 1:11, 12; 13:31; యోబు 1:20; 2:12, 13; లేవీ. 21:5, 10 చూడండి). కేవలం అంగలార్చుట మరియు ఏడ్చుట అనేవి వాక్యములో చెప్పబడినవి కాబట్టి అబ్రాహాము యొక్క విలాప అభ్యాసం వీటి వలె పెద్దదిగా లేకపోవచ్చు.[3]

## అబ్రాహాము శ్మశానభూమిని కొనుట (23:3–16)

**[3]తరువాత అబ్రాహాము మృతిబొందిన తన భార్య యెదుటనుండి లేచి హేతు కుమారులను చూచి [4]మీ మధ్య నేను పరదేశినిగాను పరవాసినిగాను ఉన్నాను. మృతిబొందిన నా భార్య నా కన్నులయెదుట ఉండకుండ, ఆమెను పాతి పెట్టుటకు మీ తావున నా కొక శ్మశానభూమిని స్వాస్థ్యముగా ఇయ్యుడని అడుగగా [5–6]హేతు కుమారులు–అయ్యా మా మాట వినుము. నీవు మా మధ్యను మహారాజవై యున్నావు; మా శ్మశానభూములలో అతి శ్రేష్ఠమైన దానియందు మృతిబొందిన నీ భార్యను పాతి పెట్టుము; నీవు మృతిబొందిన నీ భార్యను పాతి పెట్టునట్లు మాలో తన శ్మశానభూమి ఇయ్యనొల్లనివాడు ఎవడును లేడని అబ్రాహాము కుత్తరమిచ్చిరి.**

**[7]అప్పుడు అబ్రాహాము లేచి ఆ దేశపు ప్రజలైన హేతు కుమారులకు సాగిలపడి [8]మృతిబొందిన నా భార్యను నా యెదుట ఉండకుండ నేను పాతి పెట్టుట మీకిష్టమైతే నా మాట వినుడి. [9]సోహరు కుమారుడైన ఎఫ్రోను తన పొలము చివరను తనకు కలిగియున్న మక్పేలా గుహను నా కిచ్చునట్లు నా పక్షముగా అతనితో మనవిచేయుడి. మీ మధ్యను శ్మశాన భూమిగా నుండుటకు నిండు వెలకు అతడు దానిని నీకు స్వాస్థ్యముగా ఇయ్యవలెనని వారితో చెప్పెను. [10]అప్పుడు ఎఫ్రోను హేతు కుమారుల మధ్యను కూర్చుండి యుండెను. హిత్తీయుడైన ఎఫ్రోను తన ఊరి గవిని ప్రవేశించువారందరి యెదుట హేతు కుమారులకు వినబడునట్లు అబ్రాహాముతో చెప్పిన ప్రత్యుత్తరమేమనగా [11]అయ్యా అట్లు కాదు నా మనవి నాలకించుము; ఆ పొలమును నీకిచ్చుచున్నాను; దానిలోనున్న గుహను నీకిచ్చుచున్నాను; నా ప్రజల యెదుట అది నీకిచ్చుచున్నాను; మృతిబొందిన నీ భార్యను పాతి పెట్టుమనెను. [12]అప్పుడు అబ్రాహాము ఆ దేశపు ప్రజల యెదుట సాగిలపడి [13]సరేకాని నా మనవి ఆలకించుము. ఆ పొలమునకు వెల యిచ్చెదను; అది నాయొద్ద పుచ్చుకొనినయెడల మృతిబొందిన నా భార్యను పాతి పెట్టెదనని ఆ దేశ ప్రజలకు వినబడునట్లు ఎఫ్రోనుతో చెప్పెను. [14–15]అందుకు ఎఫ్రోను–అయ్యా, నా మాట వినుము; ఆ భూమి నాలుగు వందల తులముల వెండి చేయును; నాకు నీకు అది యెంత? మృతిబొందిన నీ భార్యను పాతి పెట్టుమని అబ్రాహామున కుత్తరమిచ్చెను; [16]అబ్రాహాము ఎఫ్రోను మాట వినెను. కాబట్టి హేతు కుమారులకు వినబడునట్లు ఎఫ్రోను చెప్పిన వెల అనగా వర్తకులలో చెల్లు నాలుగు వందల తులముల వెండి అబ్రాహాము తూచి అతనికిచ్చెను.**

**వచనము 3.** వేడిగా ఉండు మధ్య తూర్పు ప్రాంత వాతావరణంలో, దేహాలు వేగంగా క్రుళ్లిపోవడం ప్రారంభమౌతాయి, కాబట్టి మరణించిన ఇరవై నాలుగు గంటల లోపే సమాధి చేయబడాలి. అందువలన, క్లుప్తంగా తగిన విలాప సమయం పూర్తయిన తరువాత, **అబ్రాహాము మృతిబొందిన ఆమె యెదుటనుండి లేచి** శారా దేహమును పాతి పెట్టుటకు హెబ్రోనులో నున్న **హేతు కుమారులను** స్థలము కొరకు నివేదన చేసెను.

23:10లో "హేతు కుమారులు" హిత్తీయులుగా పిలువబడిరి; అయినప్పటికినీ, వారి చారిత్రక గుర్తింపుకు పండితుల మధ్య ఏకాభిప్రాయం లేదు. పురాతన ప్రపంచంలో అనేక ప్రజల సమూహాలు హిత్తీయులుగా పిలువబడేవారు.

మొదటిగా, అతి ప్రాముఖ్యమైన చారిత్రక హిత్తీయులు హిందీ-ఐరోపీయులు ప్రజలు, వీరు సుమారు క్రీ.పూ. 2000లో అనాతోలియలో (ఆధునిక టర్కీ) శక్తివంతమైన సామ్రాజ్యాన్ని స్థాపించారు. వారి రాజ్యం క్రీ.పూ. 1200 వరకు కొనసాగింది, ఏజియన్ "సముద్ర ప్రజల" చేత దాడి చేయబడి పడగొట్టబడింది. ఈ "సముద్ర ప్రజలు" బైబిల్ లో ఉన్నటువంటి, కనానులోకి తీసుకొనబడి అదే

సమయంలో ఐదు గొప్ప నగరాలలో తమను స్థాపించుకున్న ఫిలిష్తీయులకు సంబంధించిన వారని చాలా మంది పండితులు నమ్ముతారు.[4]

రెండవదిగా, ఉత్తర సిరియాలోని “లెబానోను” మరియు “మహా సముద్రము” (మధ్యధరా సముద్రం) నుండి “యూఫ్రటీసు నది” వరకు (కర్కె మీషు, అలెప్పో, హమాతు మరియు ఇతర వంటి కేంద్రాలు) ఉన్న నూతన హిత్తీయ నగర-రాష్ట్రాలను కూడా సూచిస్తుంది. ఈ ప్రదేశం “హిత్తీయుల దేశమంతయు” అని యెహోషువ పుస్తకంలో సూచిస్తుంది (యెహోషువ 1:4). అందువలన, ఈ కేంద్రాలలో హిత్తీయుల పాలన మొదటి అనటోలియన్ రాజ్యం నుండి ఉద్భవించింది మరియు మెగిద్దో వద్ద హిత్తీయుల కూజాలు కనుగొనడంతో వీలైనంత త్వరగా క్రీ.పూ 1650లో కనాను దేశములో ధృవీకరించబడింది. అదనంగా, పురాతత్త్య శాస్త్రజ్ఞులు చిత్రలిపి ముద్రలు మరియు ఇతర స్థలములో నగరాలను క్రీ.పూ. 1700 నుండి 1600 మధ్య కనుగొన్నారు.[5]

పద్నాలుగో శతాబ్దమునకు టెల్ ఎల్-అమర్నా సేకరణలోని ఒక గ్రంథము, యెరూషలేము రాజైన అబ్దు-హెబ (లేదా అబ్దిహెబ) ఐగుప్తులోని ఫరోకు తన నగరంపై దాడి చేసినవారికి విరోధంగా సైనిక సహాయాన్ని కోరెనని తెలియజేస్తుంది. రాజు పేరులో మొదటి భాగమైన “అబ్ది” “సేవకునికి” సెమిటిక్ పదం మరియు “హెబ” హిత్తీయ లేదా హుర్రియన్ దేవత.[6] అందువలన, పురావస్తు ఆధారాలు కొంచమైన సరే, అనటోలియన్ సిరియా సామ్రాజ్యం నుండి ఉద్భవించిన హిత్తీయులు కొంతమంది కనానులో ఉన్నారని పైన చెప్పబడిన కళాఖండాలు (క్రీ.పూ. రెండవ సహస్రాబ్ది మధ్య కాలం) సూచిస్తుంది. అయితే, అబ్రాహాము కాలం నాటికి హిత్తీయులు కనానులో ఉన్నారనడానికి ఎలాంటి ఆధారం లేదు మరియు వారు హెబ్రోను దక్షిణం వరకు తరలించబడ్డారని సూచించడానికి ఏదీ లేదు.

మూడవ సాధ్యత అబ్రాహాము కాలంలో హెబ్రోనులోని హిత్తీయులను మరియు తరువాత బైబిల్ చరిత్రలో కనబడు ఇతరులను గుర్తించుట గూర్చినది. ఈ ఆరంభ హిత్తీయులు “హేతు కుమారులుగా” పిలువబడ్డారు మరియు “హిత్తీయుడు” మరియు “హిత్తైట్” పేర్లు హెబ్రీ హల్లులో సమానంగా ఉంటాయి[7]; అందువలన, ఈ హిత్తైట్లు అనటోలియన్ హేత్తీయులకు మధ్య గల సందిగ్ధమును సులువుగా చూడవచ్చు. యెబూసీయులు, అమోరీయులు, హివ్వీయులు మరియు ఇతర కనాను ప్రజల వలె (10:16–18) వారసత్వపు చరిత్రలో హేతు కూడా కనాను వారసుడే (10:15). ఇతర స్థానిక కనానీయుల గుంపులతో వారి అనుబంధం నిశ్చితమైనది ఎందుకంటే బైబిల్ కథనంలో పేర్కొనబడిన హిత్తీయులందరికీ ఎఫ్రోను, సోయరు మరియు ఊరియా వంటి సెమిటిక్ పేర్లు ఉన్నట్లుగా కనిపిస్తుంది[8]. ఇంతేకాకుండా, అబ్రాహాము వారితో మాట్లాడుటకు ఇబ్బందిపడినట్లు లేదు. అదనంగా, యెహెజ్కేలు తరువాత యెరూషలేము నగరం గూర్చి సూచించినప్పుడు, ఇలా వ్రాసాడు, “నీ ఉత్పత్తియు, నీ జనమును కనానీయుల దేశసంబంధమైనవి; నీ

తండ్రి అమోరీయుడు, నీ తల్లి హిత్తీయురాలు” (యెహెజ్కేలు 16:3). వారి పురాతన గతం కనానీయ హిత్తీయులని (10:15), హిందు-ఐరోపీయులు మరియు అనటోలియన్ మూలము కాదనే జ్ఞాపికను ఇది భద్రపరుస్తుంది.[9]

**వచనము 4.** అబ్రాహాము తాను **పరదేశినని** (גֵּר, *ger*, నివాస విదేశీయుడు) మరియు **పరవాసినని** (תּוֹשָׁב, *thoshab,* “భూమిలేని పరదేశి”) వారి మధ్యవినయముగా ఒప్పుకున్నాడు.[10] అంటే అతను వారి భూమిని స్వాధీనపరచుకొనుటకు ఎటువంటి చట్టపరమైన హక్కు లేదని అర్థం. కనానులో భూమి హక్కులు లేవని అబ్రాహాము చెప్పిన తరువాత, శారాను పాతి పెట్టుటకు **శ్మశానభూమిని ఇవ్వమని** (נָתַן, *nathan*) హిత్తీయులను అబ్రాహాము కోరడం ఆశ్చర్యం. అయితే, *nathan* అను పదం “ఇవ్వు,” కు బదులుగా “అమ్ము” అను అర్థం ఇస్తుంది; మరియు సందర్భం చూపిన విధంగా 23:4, 9లో అది సరియైన అర్థం (NIV; NJPSV). అబ్రాహాము “శ్మశానభూమిని స్వాస్థ్యముగా” (אֲחֻזָּה, *ᵃchuzzah*) కొనాలనుకున్నాడు (NKJV).

**వచనములు 5, 6. అబ్రాహాము** తాను పరదేశియని మరియు పరవాసియని వివరించినప్పటికీ, హేతు కుమారులు అతని పట్ల స్నేహపూర్వకముగా సానుభూతి చూపారు ఎందుకంటే అతడు తన భార్య చనిపోయిన బాధలో ఉన్నాడు గనుక. పితరుని వారు సులభంగా వాడుకునే ఒక సాధారణమైన పరదేశిగా, పరవాసిగా చూడలేదు. ప్రతికూలంగా, ఆయన ఎక్కువగా గౌరవించబడ్డాడు; అతనిని వారు **మహారాజుగా** (נְשִׂיא אֱלֹהִים, *nᵉśi' 'Elohim*) చూసారు.[11] ఈ హిత్తీయులకు మరియు కనానుకు దక్షిణ భాగాన నివసించిన ఇతర ప్రజలకు అబ్రాహాము గొప్ప మరియు సంపన్నుడైన పొరుగువాడని తెలుసు. వారు బహుశా కొంత అసూయతో మరియు భయముతో అతనిని గమనించియుంటారు; ఎందుకంటే అతడు వారి మధ్య వందల పశువులకాపరుల-యోధులతో, గొప్ప గొర్రెల మరియు పశువుల మందలతో నివసించెను (14:14 చూడండి).

ఐగుప్తు ఫరో మరియు ఫిలిష్తీయుల రాజు అబ్రాహాము దేవుని ఉగ్రతకు పతనమైనారని ఈ ప్రజలు వినియుండవచ్చు (12:10–20; 20:1–18). అదనంగా, “ఆకాశమునకు భూమికిని సృష్టికర్తయును సర్వోన్నతుడును దేవుడైన యెహోవా”తో (14:22) అతనికి ప్రత్యేక సంబంధం ఉన్నదని వారు గ్రహించి యుండవచ్చు. అబీమెలెకు (21:22) వలే హిత్తీయులు, దేవుడు అబ్రాహామును దీవించి అతనిని జయప్రదం చేసాడని అంగీకరించారు. అందువలన, (వారి) **శ్మశానభూములలో అతి శ్రేష్టమైన దానియందు** అతని భార్య దేహమును పాతిపెట్టమని చెప్పెను.

**వచనము 7.** హిత్తీయులు ఈ శక్తివంతమైన పరవాసికి తన భార్య దేహమును తమ శ్మశానభూమిలో ఒక దానియందు పాతిపెట్టమని అనుమతించినప్పటికీ, అబ్రాహాముకు కావలసినది అది కాదు. అందువలన, **అబ్రాహాము లేచి హేతు**

**కుమారులైన** (సంతానమైన) హిత్తీయులకు **సాగిలపడెను.** పాల్గొన్నవారు కూర్చునప్పుడు చర్చలు జరిగినవి (23:10; రూతు 4:1–4). కొంత భూమిని కొనుటకు బేరాల ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు, పితరుడు వారికి సాగిలపడి నగరము యొక్క ప్రముఖ పురుషులకు వినయం చూపించాడు.

**వచనములు 8, 9.** శారా దేహమును (అతని) **యెదుట ఉండకుండ** వారి శ్మశానభూమిలో ఒక దానియందు **పాతి పెట్టుటకు** అతనిని అనుమతించిన వారి అంగీకారమును తలపోస్తూ హిత్తీయులతో అబ్రాహాము తన చర్చను మొదలుపెట్టెను. అతని విన్నపం ఏమిటంటే, వారు **సోహరు కుమారుడైన ఎఫ్రోనును సంప్రదించి** అతని భూమిలో ఒక భాగమును అంటే **తన పొలము చివరను ఉన్న మక్పేలా గుహను**[12] కొనుటకు తన పక్షముగా మాట్లాడమని మనవిచేసెను. ఈ విధంగా తన ప్రతిపాదనను ప్రదర్శించడం ద్వారా, పరోక్షంగా భూస్వామిని ఎదుర్కొనే పశ్చిమ ఆసియా సాంప్రదాయాన్ని పాటించాడు.

**శ్మశాన భూమిగా** నుండుటకు **నిండు వెల** చెల్లించడానికి అంగీకరించాడు. అతనికి కేవలం గుహ కావలసినప్పుడు, అతను పొలమంతటికి సరిపడినంత పూర్తి వెల చెల్లించడానికి ఎందుకు ఇష్టపడ్డాడు? 23:8–16లో యజమాని, ఎఫ్రోను మరియు అబ్రాహాము మధ్య జరిగిన చర్చలను హిత్తీయుల చట్టం ప్రభావితం చేసియుండవచ్చు. ప్రారంభ హిత్తీయుల చట్టం,[13] భూస్వామి తను నివసిస్తున్న పట్టణంలో లేదా స్థలంలో ఉన్న అధికారులతో భూస్వామ్య సేవలు అందించాలని నియమించింది. ఇటువంటి సేవలు ఏమిటంటే, పన్నులు చెల్లించడం, దాడుల సందర్భాలలో తన అనుచరులైన పురుషుల ద్వారా తగిన సైనిక సేవలు అందించడాన్ని సూచిస్తుంది.[14] భవిష్యత్ తరాలకి గుహ ఒక శ్మశానభూమి క్రింద ఉంటుందని, మరియు ఎఫ్రోను భూస్వామ్య సేవల నుండి తప్పించుకోడానికి ఆ స్థలమంతటినీ అమ్మాలని ఆశపడ్డాడు.

ఈ హిత్తీయుల చట్టం అబ్రాహాముకు కొన్ని కారణాల వల్ల వర్తించదు అని కొంత మంది అనుకున్నారు, అవి ఏమనగా: (1) హిత్తీయుల చట్టం అబ్రాహాము కాలానికి రెండు శతాబ్దాల తరువాత నాటిది, అందువలన అలాంటి చట్టం పితరుని జీవితకాలంలో అమలులో ఉన్నదో లేదో మనకు తెలియదు. (2) అబ్రాహాము జీవితకాలంలో ఆ చట్టం అమలులో ఉన్నప్పటికీ కూడా ఇది హెబ్రోను దక్షిణం వరకు అనుసరించబడిందో లేదో మనకు తెలియదు. (3) హెబ్రోను యొక్క సెమిటిక్ హిత్తీయులు (హిత్తైట్స్) చిన్న ఆసియాలోని హిందు-ఐరోపా హిత్తీయులతో ఏ జాతి సంబంధం ఉన్నది అనడానికి ఆధారాలు లేవు; లేదా, ఒకవేళ ఉంటే, దక్షిణ కనానులో ఈ చట్టమును ఆచరించే వారని ఏదీ కూడా సూచించదు.

**వచనములు 10, 11. ఎఫ్రోను హేతు కుమారుల మధ్యను కూర్చుండి యుండెను,** మరియు చెప్పినదంతయు విన్నాడు. **ఆ ఊరి గవిని** యొద్ద నున్న హేతు కుమారులకు వినబడునట్లు అతడు **అబ్రాహాముతో ప్రత్యుత్తరమిచ్చెను.**

ముందుగా, పితరుడు చెప్పినదానికి అతడు సన్మర్యాద సమాధానముతో ప్రతిపాదనను అభ్యంతరపరచాడు: **అయ్యా అట్లు కాదు, ... ఆ పొలమును నీకిచ్చుచున్నాను, మరియు దానిలోనున్న గుహను నీకిచ్చుచున్నాను.** అప్పుడు తనకు తాను మాట్లాడుతూ ఇలా చెప్పాడు, **నేను అది నీకిచ్చుచున్నాను; (అక్కడ) మృతిబొందిన వానిని పాతి పెట్టుమనెను.** సంపన్నుడైన మరియు శక్తివంతమైన పరవాసికి భూమిని మరియు గుహను "ఇచ్చేదనని" ఎఫ్రోను ముమ్మారు చెప్పాడు. ఇక్కడ ఎఫ్రోను వాడిన *nathan* ("ఇచ్చుట") అను క్రియ యొక్క ముమ్మారు ఉపయోగం, అబ్రాహాము 9 మరియు 13 వచనములలో ముమ్మారు వాడిన *nathan* ("నాకిచ్చు" లేదా "వెల ఇచ్చెదను"; NIV) పదముకు తగినదిగా ఉంది.

**వచనము 12.** మరలా, **అబ్రాహాము ఆ దేశపు ప్రజల యెదుట సాగిలపడెను** (23:7 చూడండి). తన భార్యను పాతి పెట్టుటకు పొలమును అమ్ముటకు ఎఫ్రోను ఇష్టపడ్డాడని అతను కృతజ్ఞత తెలిపాడు. అతడు సన్మర్యాద గౌరవం చూపిస్తూ "సాగిలపడెను" మరియు వారి వైఖరికి కృతజ్ఞత తెలిపెను.

**వచనము 13. ఆ పొలమునకు వెల యిచ్చెదను** ("చెల్లించెదను"; NIV)**; అది నాయొద్ద పుచ్చుకొనినయెడల మృతిబొందిన నా భార్యను పాతి పెట్టెదనని ఆ దేశ ప్రజలకు వినబడునట్లు ఎఫ్రోనుతో చెప్పెను** పితరుడు వేడుకొనెను. అబ్రాహాము తన కుటుంబం కొరకు శాశ్వతమైన శ్మశానభూమిని భద్రపరచుటకు ఒకే ఒక్క నిరీక్షణ ఏమిటంటే సాక్షుల సమక్షంలో భూమిఅంతటిని కొనడానికి పద్ధతి ప్రకారమైన ఒప్పందంలోకి ప్రవేశించుట. అందువలన, ఎఫ్రోను తన అభ్యర్థనను అంగీకరించడానికి విన్నపించాడు. ఒప్పందాన్ని ముగించడానికి అతని పట్టుదల అవసరమని అతను నమ్మాడు.

**వచనములు 14, 15.** చివరగా, **అబ్రాహాముకు** జవాబిచ్చుట ద్వారా ఎఫ్రోను ఒప్పుకోటానికి బలవంతం చేయబడ్డాడు. ఆ **భూమి** ధరను **నాలుగు వందల తులముల వెండి**కి ఏర్పాటు చేసాడు. ఇలా అడగడం భూమి మార్కెటు విలువకు తగినట్లుగా ఉన్నది అని నిశ్చయంగా విశ్లేషించడానికి అసాధ్యం. ఎందుకంటే, ఆ సమయంలో కనానులో వెండి తులములుకు[15] గల విలువ తెలియనిది. తదుపరి, గుహను కలిగియున్న పొలము యొక్క పరిమాణం ఎంతో వాక్యంలో ఇవ్వబడలేదు. సిరియా ఉత్తర తీరంలో ఉగారిట్ నుండి మూడు ప్రాచీన గ్రంథాలు (క్రీ.పూ. పద్నాలుగు నుండి పదమూడు శతాబ్దం) ఉన్నవి, అవి స్థిరాస్తి అమ్మకాలకు నాలుగు వందల వెండి తులములను సూచిస్తుంది. అయితే, ఈ భూములు అబ్రాహాము కొనుగోలు చేసిన భూభాగం కంటే పెద్దగా ఉండి ఉండవచ్చును.

చాలా స్థిరాస్తుల లావాదేవీల గురించి పాత నిబంధన గ్రంథంలో చెప్పబడినవి. యాకోబు హమోరు కుమారుల యొద్ద "నూరు వరహాలకు" పొలము యొక్క భాగమును కొనెను (33:19). ఈ ఉదాహరణను పోల్చుటలో గల సమస్య ఏమిటంటే బరువు యొక్క కొలత అనిశ్చితంగా ఉంది; ఇది ఒక తులమునకు ఎక్కువగా లేదా

తక్కువగా ఉండవచ్చు. దావీదు అరౌనా కళ్లమును కేవలం ఏబది తులముల వెండికి కొనినను (2 సమూ. 24:24) దేవాలయపు భూమిని మాత్రం ఆరువందల తులముల బంగారముతో కొనెను (1 దిన. 21:25). ఒమ్రీ సమరయ కొండను ఆరు వందల తులములకు కొనెను (1 రాజులు 16:24). ఈ సందర్భాలలో, అబ్రాహాము కొనినదానికంటె కూడా ఈ భూమి యొక్క స్థలము (కళ్లము కాకుండా) ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. తరువాత, ద్రవ్యోల్బణం సమయంలో, యిర్మీయా అనాతోతులోనున్న పొలమును కేవలం పదియేడు తులములకే కొనెను (యిర్మీయా 32:9).

ఎఫ్రోను అడిగిన వెల చాలా ఎక్కువ అని ఈ తులనాత్మక అంచనా సూచిస్తుంది. అయితే, ఎఫ్రోను నాలుగు వందల తులములు తక్కువే అన్నట్లుగా నటించాడు: **నాకు నీకు అది యెంత? మృతిబొందిన నీ భార్యను పాతి పెట్టుమని అబ్రాహామున కుత్తరమిచ్చెను.** ఎఫ్రోను చెప్తున్నాడు, "మనమిద్దరం సంపన్నులమే ఆ వెల చెల్లించడానికి అడ్డంకి లేదు; ముందుకు వెళ్లి నీ భార్యను పాతిపెట్టు."

**వచనము 16. ఎఫ్రోను** అడిగిన వెండి వెల న్యాయమైందో లేదో, **అబ్రాహాము** వివాదానికి ప్రయత్నించలేదు లేదా ధర తగ్గించమని అతనిని ఒప్పించనూ లేదు. వాక్యము చెప్తుంది, అతడు **ఎఫ్రాము మాట వినెను** మరియు అతడు చెప్పిన వెండికే (అతనకి) **తూచి ఇచ్చెను.** కొనుగోలు చట్టపరంగా చేయుటకు ఇది **హేతు కుమారులకు వినబడునట్లుగా జరిగెను.** ఇది బహిరంగంగా జరిగినది కనుక, మరియు **వర్తకులలో చెల్లు ప్రామాణిక ప్రకారం** వెండి తూయబడినది గనుక, భూమి యొక్క యాజమాన్యం పై ఎటువంటి భవిష్యత్తు వివాదం ఉండదు.

తక్కెడ మరియు బరువు పశ్చిమ ఆసియాలో మారుతూ ఉండేవి, అందువలన రెండు పక్షములకు న్యాయ ప్రమాణాలు ఉండాల్సిన అవసరం లేదు. అందువలన, అబ్రాహాము "వర్తకులలో చెల్లు ప్రామాణిక"ను (NRSV; ESV) వాడాడు. ఆల్ఫ్రెడ్ జె హేర్త్ ఇలా చెప్పాడు, పితరుడు నగరపు గవిని లోపల ప్రాంతమున ఉన్న వర్తకుల తక్కెడను అరవు తీసుకున్నాడు, మరియు ఆ నాలుగు వందల తులముల వెండి ఇంచుమించు పది పౌండ్లు తూయబడింది. తదుపరి, అతడు కొంత ఆస్తిని కొనుగోలు చేయాలని ఆశించాడు గనుక గవిని యొద్దకు అంత వెండిని తీసుకువెళ్లాడు అనేది అసాధారణం కాదు అని ఊహించాడు.[17]

## మక్పేలా గుహలో శారా భూస్థాపనము (23:17–20)

**[17–18]ఆలాగున మమ్రే యెదుటనున్న మక్పేలాయందలి ఎఫ్రోను పొలము అనగా ఆ పొలము దానియందలి గుహయు దాని పొలిమేర అంతటిలోనున్న ఆ పొలము చెట్లన్నియు, అతని ఊరి గవిని ప్రవేశించు వారందరిలో హేతు కుమారుల యెదుట అబ్రాహామునకు స్వాస్థ్యముగా స్థిరపరచబడెను. [19]ఆ తరువాత అబ్రాహాము కనాను**

**దేశములో హెబ్రోనను మమ్రేయెదుట నున్న మక్పేలా పొలము గుహలో తన భార్యయైన శారాను పాతిపెట్టెను. [20]ఆ పొలమును దానిలోనున్న గుహయు హేతు కుమారులవలన శ్మశానముకొరకు అబ్రాహామునకు స్వాస్థ్యముగా స్థిరపరచబడెను.**

**వచనములు 17, 18.** చట్టపరమైన మరియు బంధించే స్వభావాన్ని నిర్ధారించుటకు భూమి యొక్క కొనుగోలు వివరాలు సారాంశంగా చెప్పబడ్డాయి. అది **మమ్రే** యెదుట **మక్పేలాలో నున్న, ఎఫ్రోను పొలము**, మరియు **దానిలో నున్న పొలము మరియు గుహయు**, అలాగే **దాని పొలిమేర అంతటిలోనున్న చెట్లన్నియు** కలిగియున్నది.[18] చెప్పబడిన అన్ని వివరాలు **స్వాస్థ్యముగా అబ్రాహాముకు స్థిరపరచబడెను**; మరియు ఇది అతని ఊరి గవిని యొద్ద సాక్ష్యముగా ఉన్న హేతు కుమారుల యెదుట చేయబడినది. 17 మరియు 20 వచనములలో ఉన్న "స్వాస్థ్యముగా స్థిరపరచబడెను" అను అనువాదము, ఈ కొనుగోలులో చేతి వ్రాత పత్రం ఉన్నదని సూచిస్తుంది. అయినప్పటికీ, హెబ్రీ క్రియ కేవలం "పంపబడిన" (NRSV; NJPSV) లేదా "బదిలీ చేయబడిన" (NLT)[19] అని సూచిస్తుంది. ఏదిఏమైనప్పటికీ, ఈ ఒప్పందం పితరునికి మరియు అతని వారసులకు మక్పేలా పొలము మరియు చెట్లన్నిటి పట్ల నిస్సందేహమైన చట్టపరమైన హక్కును ఇచ్చింది మరియు ఇది అబ్రాహాము తనదని పిలువదగిన వాగ్దాన దేశములో మొదటి తునక.

**వచనము 19.** పితరుడు చట్టపరమైన కార్యాలను ముగించిన తరువాత, **కనాను దేశములో హెబ్రోనను మమ్రే (అది హెబ్రోను)**, యెదుటనున్న **మక్పేలా పొలము గుహలో తన భార్యయైన శారాను పాతి పెట్టెను.** ఇలా చేయడం ద్వారా, ఒక దినమున మెస్సీయ రాబోవు భవిష్యద్ యూదులకు తల్లిగా, సరియైన సమాధితో ఆమెను ఆయన సత్కరించాడు (మత్తయి 1:1–16). అంతేగాక, ఒక రోజు తన సంతతి స్వాస్థ్యముగా పొందుకునే కనాను దేశమునకు వారిని నడిపించాడు. శారాకు అదనంగా, మక్పేలా గుహలో పాతిపెట్టబడిన వారు అబ్రాహాము, ఇస్సాకు, రిబ్కా, లేయా మరియు యాకోబు (25:9, 10; 49:29–32; 50:13).

కొన్ని శతాబ్దాలుగా యూదుల ద్వారా, క్రైస్తవుల ద్వారా మరియు ముస్లింల ద్వారా సమానంగా సన్మానించబడే హెబ్రోనులో మక్పేలా గుహ వద్ద ఉన్న పితరుల సమాధులు సంప్రదాయ స్థలాలు. వాస్తవంగా, ప్రస్తుతం ఆ భవనము యొక్క గోడలు మహా హేరోదు కాలంలో నిర్మించబడినవి. అక్కడ ఆదిమ ఇశ్రాయేలీయుల నుండి ఉన్నటువంటి వస్తువులను కనుగొన్నప్పటికీ, పితరుల కాలం గురించి ఏమీ కూడా ధృవీకరించలేదు.

**వచనము 20.** అధ్యాయమునకు పునరుక్తి ముగింపు ఉన్నది: **ఆ పొలమును దానిలోనున్న గుహయు హేతు కుమారులవలన శ్మశానముకొరకు అబ్రాహామునకు స్వాస్థ్యముగా స్థిరపరచబడెను.** ఈ భూమిని ఆర్జించుటను గూర్చి మరలా చెప్పుట ద్వారా, ఈ భాగంలో ఉన్న ప్రాముఖ్య సంఘటనను ఒత్తి చెప్తుంది: ఈ కనానీయుల

నుండి అబ్రాహాము కొన్న భూమి, రాబోయే వాటికి పూర్వగామి.

## అన్వయము

### మరణ సమయములో (అధ్యాయము 23)

మృత్యువు వ్యక్తులను గౌరవించదు. ప్రతికూలంగా, ఇది గొప్పగా సమపరచేది. జీవితంలో వారి పరిస్థితులతో సంబంధం లేకుండా ఇది యౌవనులను మరియు వృద్ధులను, ధనికులను మరియు పేదవారిని, పురుషులను మరియు స్త్రీలను తీసుకుంటుంది. వివాహ బంధమును, ఇల్లును లేక కొన్ని సార్లు సమాజమును తెంచుకుంటూ మరణము ఆహ్వానము లేకుండా చొరబడుతుంది. దావీదు (2 సమూ. 12:15–23), యోబు (యోబు 1:20), యిర్మీయా మరియు యూదా ప్రజలకు (2 దిన. 35:20–25), యేసు మరియు ఆయన స్నేహితులతో సహా (యోహాను 11:31–36) అందరికి సంతాప సమయం వచ్చింది. పౌలు మరణమును "కడపటి శత్రువు" అని పిలిచాడు (1 కొరింథీయులకు 15:26). జీవితంలో ఎప్పుడు వచ్చింది అని కాకుండా, ప్రియమైన వారిని తీసుకున్నప్పుడు మరణము అంగలార్పుకు గురి చేస్తుంది.

మన వాక్యము ఇలా చెప్తుంది, "అబ్రాహాము శారా నిమిత్తము అంగలార్చుటకును ఆమెను గూర్చి యేడ్చుటకును వచ్చెను" (23:2). పితరుడు తన ప్రియమైన భార్య కొరకు యేడ్చుటకు గుడారములోనుకి ప్రవేశించినప్పుడు, తప్పనిసరిగా అతనికి చాలా జ్ఞాపకాలు తన మనుసులో ప్రవహించియుంటాయి. అతను వంద సంవత్సరాలు లేదా ఇంకా ఎక్కువ గల వివాహ సంబంధమును జ్ఞాపకంచేసికొనియుండవచ్చు-వారు కలసి జీవించిన కాలంలో గల ఎత్తు మరియు పల్లాలను గుర్తుచేసుకున్నాడు. ఆ సంవత్సరాలలో తేడాలు మరియు విభేదాలు వారు అనుభవించినప్పటికీ కూడా, ఎంత ప్రేమించే మరియు నమ్మకమైన భార్యగా ఉన్నది మరియు ఎంతగా గుర్తొస్తుందో అని నిస్సందేహంగా అనుకున్నాడు. ఇష్మాయేలు జననం వలన (16:1–6) హాగరుపై ఆమెకున్న కోపం మరియు అసూయ వలన ఆమె అతనిని నిందించిన విషయమును మరియు ఆమె కోరిక మేరకు తిరిగి ఎన్నడూ రాకుండా వారిని పొమ్మని పంపివేసినందుకు ఎంతగా కలత చెంది బాధపడ్డాడో, (21:8–14) వీటన్నిటినీ అతను జ్ఞాపకము తెచ్చుకొనియుండవచ్చును. అయితే, వారి సమస్యలు కొన్ని అతని స్వార్థం ద్వారా వచ్చాయని మరియు విశ్వాసంలో తగ్గిపోయాడని కూడా జ్ఞప్తికి తెచ్చుకున్నాడు.

అన్నిటి కంటే ఎక్కువగా, వారికి పాపాలు మరియు లోపాలు ఉన్నపటికీ, దేవుడు తన దయ ద్వారా, వారి జీవితాలను ఏ విధంగా దీవించాడో జ్ఞాపకం చేసుకున్నాడు. వాస్తవానికి, కుమారుడు కలుగుతాడనే మానవుల ఆశ

పోయినప్పటికీ, దేవుడు అద్భుతంగా ముదుసలి శరీరాలకు జీవమిచ్చి వాగ్దాన కుమారుడైన ఇస్సాకును తెచ్చుటలో శక్తి నిచ్చినప్పుడు వారు గొప్ప ఆనందమును పంచుకున్నారు (21:1–7). మరో ఆనంద పర్యాయం ఏమిటంటే, మోరియా పర్వత పై మరణము నుండి వారి ప్రియ పుత్రుడైన ఇస్సాకును దేవుడు తప్పించాడో అన్న కథను ఇంటికి తిరిగి వచ్చి శారాతో ఇవన్నీ పంచుకున్న రోజు (22:1–12). పునరుద్ధరించబడిన యెహోవా వాగ్దానమును అతడు మరలా చెప్పియుండవచ్చు: అతని దీవెనలు వారి కుమారుని పై ఉంటాయని, మరియు అతని సంతానం "భూలోకములోని జనములన్నిటి పై" ఆశీర్వాదమును తెస్తారు (22:18). ఇస్సాకు వయస్సులో పెరుగుతుండడం వీక్షిస్తున్నప్పుడు, వారు సంవత్సరాలు తరుగుచుండగా ఈ వాగ్దానం అబ్రాహాముకు మరియు శారాకు గొప్ప ప్రోత్సాహమును తెచ్చి యుండవచ్చు.

ఆ ఏడ్పు గుడారములో అబ్రాహాము మనసులో ఏ ఆలోచనలు కలిగాయో మనకు తెలియదు; కానీ "విశ్వాసులకు తండ్రి"గా (రోమా 4:16) పిలువబడ్డాడు గనుక, ఒక మంచి భార్య మాత్రమే కాదు కానీ "పవిత్ర" మైన మరియు దేవుని యందు "నిరీక్షణ" కలిగిన స్త్రీ అను వాస్తవమును జ్ఞాపకం చేసుకున్నట్లు అనిపిస్తుంది (1 పేతురు 3:5). విశ్వాసం ద్వారా, "దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునై యున్నాడో, పునాదులుగల ఆ పట్టణములో" ఆమెతో కూడా మరలా ఉంటానని అనుకున్నాడు (హెబ్రీ. 11:10). ఈ రోజు దేవుని ప్రజలకు ఇదే ఆశ ఉన్నది.

మనము మరణమును ఎదుర్కొన్నపుడు లేదా ప్రేమించిన వారు జీవితమును ముగించుకొని వెళ్లిపోయినప్పుడు కలిగిన యేడ్పుకు, జ్ఞాపకాలు క్రీస్తులో మనకు ఉన్న వాగ్దానాలను బట్టి ఒక గొప్ప దీవెనలాంటివి (యోహాను 5:24–29; 11:25, 26). జ్ఞాపకాలు గుండెనొప్పికి కూడా కారణమౌతాయి; భవిష్యత్ ఆశలను మరియు జీవితంలో ఆనందములను దోచుకుంటాయి. మన జ్ఞాపకాల ప్రభావం మన గత పనులను ఏ విధంగా చూస్తామో అను దాని పై పడుతుంది. దేవుని యెదుట మారుమనస్సు పొంది మనపై నేరము మోపినవారితో సరిచేసుకుంటు పాపాలను జ్ఞాపకం చేసుకోవడం మంచిది మరియు ఆరోగ్యమైనది. అప్పుడు దేవుడు మనలను క్షమించి మన "పాపములను ఎన్నడూ జ్ఞాపకము చేసికోడు" (హెబ్రీ. 8:12; 10:17 చూడండి).

ఒక కోణంలో, మరణ సమక్షంలో క్రైస్తవులు అబ్రాహాముతో పాటు ఏకంగా ఉంటారు. దేవుని నుండి అభయవాక్కులను వినాలని అనుకుంటాము, కానీ పరలోకం మౌనంగా ఉంటుంది. వేరే కోణంలో, పితరుని విశ్వాసం కంటే మన విశ్వాసం నిర్దిష్టత కలిగిన నిరీక్షణలో స్థాపితమైనది. హెబ్రీ రచయిత విరుద్ధాన్ని అందించాడు: పూర్వకాలమందు దేవుడు "పితరులతో మాట్లాడాడు" (అబ్రాహాము మరియు ఆయనను వెంబడించినవారు); కానీ "ఈ దినముల అంతమందు

కుమారుని ద్వారా మనతో మాట్లాడెను" (అపొస్తలుల ద్వారా మరియు వారిని విన్న వారి ద్వారా) (హెబ్రీయులకు 1:1, 2; 2:3, 4). దేవుడు, యేసు ద్వారా, మరణముపై చివరి మాటలను పలికెను-వినపడేట్లుగా (యోహాను 5:24–29; 11:23–26, 38–44) మరియు తన మహిమగల పునరుత్థానమునకు ప్రత్యక్ష సాక్షులుగా ఉండుటకు ప్రదర్శన ద్వారా (యోహాను 20:19–31). మన విశ్వాసం అభిలాషగల ఆలోచనపై ఆధారపడి ఉండదు కానీ, మరణము తరువాత సజీవమైన ప్రభువును చూసిన మనుష్యుల నిజమైన సాక్ష్యం పై ఆధారపడి ఉంటుంది. సువార్తను ప్రకటించడానికి (శుభవార్త) ఇష్టపూర్వకంగా సమస్తమును త్యాగం చేసారు, తద్వారా మనం ఆయనతో పునరుత్థానంలో పాలుపంచుకోవచ్చు (1 కొరింథీ. 15:1–8, 20–26, 50–58; థెస్స. 4:13–18).

## పరిశుద్ధ గ్రంథములో గల స్మారక చిహ్నములు (అధ్యాయము 23)

అబ్రాహాము తన భార్యకు ఒక శాశ్వతమైన స్మారక చిహ్నమును స్థాపించాడు. ఆమె శరీరం కొరకు కేవలం ఒక విశ్రాంతి స్థలమును, అనగా భవిష్యత్తు వంశముల ద్వారా సులువుగా మర్చిపోబడే స్థలమును, మాత్రమే ఆయన కోరలేదు. దీనికి బదులుగా, ఒక పొలములో ఒక గుహను – గొప్ప జనముల యొక్క తల్లిని సమాధిచేసిన ప్రదేశముగా తన సంతానము వారు ఎల్లప్పుడూ గుర్తుంచుకునే విధంగా ఒక శాశ్వత సమాధి స్థలమును – ఆయన పొందాలనుకున్నాడు.

పరిశుద్ధ గ్రంథంలో ఉన్న విశ్వాసములో ప్రాముఖ్యమైన విషయం ఒకటి ఉంది. అదేమంటే తన ప్రణాళికలను నెరవేర్చుటకుగాను దేవుడు ఆశీర్వదించి ఉపయోగించుకున్న ప్రజలకు కొన్ని స్మారక చిహ్నములను నిర్మించడం (హెబ్రీ. 11 చూడండి). దేవుని గొప్ప రక్షణార్థమైన కార్యములను చూచినప్పుడు, విశ్వాసులు అనువారు మన భౌతిక మరియు ఆత్మీయమైన పితరుల విశ్వాసమును జ్ఞాపకమునకు తెచ్చుకుని పునఃప్రతిష్ట చేసుకోవాలి. ప్రేమించే ఒకని శరీరము దాచబడియున్న ప్రదేశమును ఒక గురుతుతో గుర్తించి ఒక సమాధిని కట్టడం అనేది తప్పేమీ కాదు. మన జీవితాలలో మనం ఎంతగానో ప్రేమించి మనకంటే ముందుగా వెళ్లిన వారిని గౌరవించుటకు ఇది ఒక విధానం. మనం ఎవరు, మనం ఎక్కడ నుండి వచ్చాము, మరియు మనం ఎక్కడికి వెళ్తున్నాము అనువాటిని ఇది మనకు జ్ఞాపకం చేస్తుంది. మరణించిన వారు ఒకవేళ దేవునికి నమ్మకమైన బిడ్డ అయితే ఇది ఇంకా వాస్తవం, అంటే శారా వలె, ఎందుకంటే అది మనలను ప్రోత్సహించి జీవితంలో ఒక దిశను మరియు ఉద్దేశ్యమును ఇస్తుంది.

పరిశుద్ధ గ్రంథంలో ఉన్న స్మారక చిహ్నాలు ప్రజలను గొప్ప చేయుటకు కట్టినవి కావు. "విశ్వాస వీరులు" (హెబ్రీ. 11) కూడా పాపము చేసి వారి జీవితాలలో దేవుని చిత్తము విషయంలో పడిపోయారు. ఉదాహరణకు తీసుకుంటే దావీదు "పరిశుద్ధ గ్రంథంలో అతి గొప్ప పరిశుద్ధుడుగాను మరియు అతి గొప్ప పాపిగాను"

గుర్తించబడ్డాడు. ఆయనకు డెబ్బది-మూడు కీర్తనలు ఆరోపించబడ్డాయి, అలానే వ్యభిచారము మరియు నరహత్య అనే పాపములు కూడా (2 సమూ. 11:2–4; కీర్తన. 32; 51). అపొస్తలులందరిలో సువార్తను ఎక్కువగా ప్రకటించినవారిలో పౌలును ముందు చూపుతారు. అది వాస్తవమైయుంటుంది; కాని తనలో ఉన్న అత్యావేశం తనకు మునుపు జతపనివాడైన బర్నబాతో తెగతెంపులు చేసుకొనునట్లు చేసింది, అందుకే ఆయన తన రెండవ సువార్త ప్రయాణమును తమ మొదటి ప్రయాణంలో మధ్యలోనే వెనుదిరిగిన యోహాను అనబడే మార్కుతో చేయవలసి వచ్చింది (అపొ. 13:13; 15:36–41).

నిర్ణయించబడిన ఆరాధనా సమయములలో తన ప్రజలు ఆచరించవలసినదిగా దేవుడు అధీకృతం చేసిన స్మారక చిహ్నాలు పరిశుద్ధ గ్రంథంలోని గొప్పవారైన స్త్రీపురుషులను గౌరవించవు. కేవలము నరులైన వారిని పూజించుట ప్రమాదకరము. ఎందుకంటే అది మానవ ఘనతలకు దారితీస్తుంది–అంటే దైవీకరణం చేయువరకు దారితీసి పరిశుద్ధులైన ప్రజలు ఆరాధనకు ప్రార్థనలకు వస్తువులుగా మారతారు. మరోవైపు, దేవుని యొక్క పాతనిబంధనపు ప్రజలు వారు దేవుని ప్రసన్నతను మరియు శక్తిని అనుభవించిన మరియు ఆయనను ఆరాధించిన అనేక చోట్ల యోగ్యమైన రాతి స్మారక చిహ్నాములను నిలిపారు. ఇది సీనాయి పర్వతమునొద్ద (నిర్గమ. 24:4), యోర్దాను నది/గిల్గాలు (యెహోషువ 4:7–9, 20), షెకెము (యెహోషువ 24:25, 26), మరియు ఇతర స్థలాలలో జరిగింది. దేవుని మహాత్కార్యములకు నిలువబెట్టిన రాతి చిహ్నాలు కూడా భవిష్యత్తు తరములు సమయమునకు దూరంగా మరియు అట్టి సంఘటనలు చోటుచేసుకున్న స్థలములకు దూరంగా వెళ్లిన కొలదీ తమ ప్రాధాన్యతను కోల్పోతాయి.

పరిశుద్ధ గ్రంథంలో ఉన్న అత్యంత అర్థవంతమైన స్మారక చిహ్నాలు సమయానుకూలతకు లేదా ప్రత్యేక స్థలములకు పరిమితమైనవి కావు. దీనికి విరుద్ధంగా, విశ్వాసుల హృదయములను కృతజ్ఞతకు రేపి ప్రత్యేక దినములలో మరియు అర్థవంతమైన విధానములలో వారు దేవుని స్తుతించుటకు దారితీసిన దేవుని మహాత్కార్యముల పునఃస్మృతి వంటి ఆరాధనా క్రియలను అవి కలిగియున్నాయి.

ఉదాహరణకు, ఐగుప్తు దేశంలో బానిసలుగా ఉన్న ఇశ్రాయేలీయులను వారి కష్టమైన శ్రమ నుండి విడిపించుటకు విశ్రాంతి దినమును దేవుడు వారికి మొట్టమొదటిసారిగా ఇచ్చినప్పుడు, వారు దానిని అభినందించి ఆరు దినముల సృష్టి తరువాత దేవుడు విశ్రాంతి తీసుకున్న తీరునకు గుర్తుగా దానిని ఆచరించాలని దేవుడు ఆశించాడు (నిర్గమ. 20:10, 11; ఆది. 2:1–3 చూడండి). అరణ్యములో దరిదాపుగా నలుబది సంవత్సరములు సంచారము చేసిన తరువాత మోషే ద్వారా దేవుడు ఇశ్రాయేలునకు మరలా విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞను ఇచ్చాడు. ఈసారి, నిర్గమములో వారు ఐగుప్తు నుండి నిష్క్రమణ అనే వేదాంతపరమైన

కార్యమునకు ముడిపెట్టాడు, తద్వారా ప్రజలు వారిని ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించిన దానికి కృతజ్ఞతగా దానిని ఆచరిస్తారని దేవుడు చేసాడు (ద్వితీ. 5:12–15).

స్మారక చిహ్నముల ఆచరణకు సంబంధించి లోతైన ప్రాధాన్యత పస్కా మరియు పిమ్మట వచ్చే వారము కాలపు రొట్టెల పండుగలో కనుగొనగలం, ఈ రెంటిని మొదటి శతాబ్దపు వారు "పస్కా" అని పిలిచేవారు. ఈ పస్కా ఆచరణను గూర్చి మోషే ఇశ్రాయేలీయులకు ఉపదేశిస్తూ అంటాడు, "మీరు దాస గృహమైన ఐగుప్తునుండి బయలుదేరివచ్చిన దినమును జ్ఞాపకముచేసికొనుడి. యెహోవా తన బాహుబలముచేత దానిలోనుండి మిమ్మును బయటికి రప్పించెను" (నిర్గమ. 13:3). దీనిని ఈ క్రింది హెచ్చరికతో కొనసాగించాడు: "నేను ఐగుప్తులోనుండి వచ్చినప్పుడు యెహోవా నాకు చేసినదాని నిమిత్తము పొంగని రొట్టెలను తినుచున్నానని నీ కుమారునికి చెప్పవలెను" (నిర్గమ. 13:8).

సుదూరమైన గతంలో దేవుడు తన ప్రజలకు చేసిన ఒక సాధారణమైన సంఘటనగా ఇశ్రాయేలు పస్కాను ఆచరించకూడదు. బదులుగా, ఈ ఆజ్ఞ వ్యక్తీకరించబడి ప్రస్తుత కాలమునకు తేబడింది. మూడు సహస్రాబ్దుల పైబడి, ప్రతి సంవత్సరము పస్కా దినమున యూదులు ఈ వాక్యమును ఇలా చెప్పేవారు, "నేను ఐగుప్తులోనుండి వచ్చినప్పుడు యెహోవా నాకు చేసినదాని నిమిత్తము" అని (నిర్గమ. 13:8). ఆ సంఘటనను చిరస్మరణీయం చేయుటకు మరియు ఆ గొప్ప రక్షణార్థమైన ఘటనలో ప్రవేశించుటకు ఇది ఒక క్రియాశీలకమైన విధానం. సారాంశంలో చెప్పాలంటే, "ఇశ్రాయేలు చరిత్ర నా చరిత్ర" అని ప్రతి తరము చెప్తుంది. "ప్రతి తరములో కూడా ప్రతి మనిషి తను కూడా ఐగుప్తు నుండి వచ్చానని అనుకోవాలి" అని మిష్నా చెప్తుంది.[20]

ఒక విధంగా క్రైస్తవులు కూడా ఆరాధనలో క్రీస్తు యొక్క సిలువను స్మరణ చేయుట ద్వారా ఇదే చేస్తారు. ఒక పాత కీర్తన మరలా మరలా వ్యసన సూచకమైన విధానంలో ఇలా చెప్తుంది, "నా ప్రభువును వారు సిలువ వేసినప్పుడు నీవు అక్కడ ఉన్నావా?" దీనికి సమాధానం "అవును" అని. అంటే, మనమందరమూ అక్కడ ఉన్నాము ఎందుకంటే ఆయన సిలువ మన సిలువయే. అసలు మరణము పొందవలసినవారము మనము; కాని ఆయన మన స్థానమును తీసికొని "తన శరీరమందు మన పాపములను మ్రాను మీద" మోసికొనెను (1 పేతురు 2:24). ఆయన "లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" (యోహాను 1:29). ఇందుచేతనే, "క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను" అని పౌలు కొరింథీయులతో అంటాడు (1 కొరింథీ. 5:7). గలతీయులతో ఆయన అన్నాడు, "నేను క్రీస్తుతో కూడ సిలువవేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని

కుమారుని యందలి విశ్వాసమువలన జీవించుచున్నాను" (గలతీ. 2:20).

యూదులు పస్కాను వ్యక్తిగతీకరించినట్లుగా పౌలు కూడా సిలువను వ్యక్తిగతీకరించాడు. "నన్ను ప్రేమించి నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన" అని అపొస్తలుడు చెప్పినట్లుగా ప్రతి వ్యక్తి క్రీస్తును గూర్చి చెప్పగలడు (గలతీ. 2:20; వక్కాణం జోడించబడెను). క్రీస్తు సిలువ అనే గతకాలపు సంఘటన ప్రస్తుతములోనికి తేబడి వ్యక్తిగతం చేయబడింది. చరిత్రలో ఒక అడుగు సూచనలా ఉండుటకంటే, రెండు వేల సంవత్సరముల క్రితం సిలువపై క్రీస్తు యొక్క మరణము ప్రతి క్రొత్త తరమునకు వాస్తవమై సువార్త ప్రకటించబడుతుండగా వింటున్న వారినందరినీ ఒప్పిస్తుంది. ఈ సజీవమైన స్మారక చిహ్నము ప్రతివిధమైన మంచి మరియు యధార్థ హృదయములను చొచ్చి మరియు ప్రజలు "దేవుని శక్తి" ద్వారా రక్షణకు నడిపించబడుతుండగా మార్పును తెస్తుంది (రోమా. 1:15, 16; హెబ్రీ. 4:12 చూడండి).

బాప్తిస్మములో ఒక పాపియొక్క ప్రత్యుత్తరమును యేసు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములకు ఒక సజీవమైన మరియు వ్యక్తిగత స్మారకముగా పౌలు అభివర్ణించాడు. క్రీస్తులో బాప్తిస్మము పొందుచుండగా మనము "ఆయన మరణములోనికి" బాప్తిస్మము పొందుచున్నామనే వాస్తవమైన అర్థమును పౌలు గ్రహించాడు (రోమా. 6:3, 5). విశ్వాసము ద్వారా ప్రతి క్రైస్తవుడు క్రీస్తు మరణములోనికి ప్రవేశించాడు తద్వారా గతము అనునది ప్రస్తుతములో వాస్తవికము చేయబడుతుంది. యేసు యొక్క మరణము మన మరణము అయినదని మనము చెప్పవచ్చు. మన విశ్వాసము వలన దేవుడు ఆయన పునరుత్థానమును మన పునరుత్థానముగా చేసాడు. మనము "ఆయనతో పాతిపెట్టబడుట" మాత్రమే కాదు, కాని "నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు" మనము నీటి బాప్తిస్మము నుండి బయటకు వచ్చినవారము కూడా (రోమా. 6:4).

ప్రభువు భోజనమును గూర్చి కూడా ఇదే నియమము వాస్తవము. యేసు యొక్క శరీరము మరియు రక్తమునకు ఇది సజీవమైన స్మారకము, కాగా యుగసమాప్తి వరకు సమస్త స్థలములలో ఉన్న క్రైస్తవులు దీనిని ఆచరించవలసి యున్నారు. మేడ గదిలో, ప్రభువు రొట్టెను తీసికొని, "ఇది మీకొరకు ఇయ్యబడుచున్న నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని" చెప్పాడు (లూకా 22:19). ఆయన ద్రాక్షరసమును చూసి, "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" (మత్తయి 26:28) అని అన్నాడు. సీనాయి పర్వతము దుగువన పది ఆజ్ఞల నిబంధనను ఇశ్రాయేలు ఆమోదించినప్పుడు జరిగిన కార్యక్రమమునకు ఈ వాక్యములో ప్రతిధ్వనులు ఉన్నాయి, అక్కడ మోషే దహనబలుల[21] రక్తములో కొంత రక్తమును బలిపీఠము మీదను మరియు ప్రజల మీదను ప్రోక్షించాడు. "యెహోవా

మీతో చేసిన నిబంధన రక్తము ఇదే" అని ఆయన అన్నాడు (నిర్గమ. 24:8). క్రైస్తవులు రొట్టెలో మరియు ద్రాక్షరసములో పాలుపొందినప్పుడు సిలువపై గతంలో యేసు చేసిన బల్యర్పణ మరియు పాపముల క్షమాపణ నిమిత్తము చిందింపబడుతున్న ఆయన రక్తమును ప్రస్తుతములో మరలా శాసిస్తుంది. ఈ గతకాలపు మరియు ప్రస్తుత కాలపు ఘటనలు మహిమాయుక్తమైన రాబోయే ఘటనతో ఏకం చేయబడ్డాయి. పౌలు, "మీరు ఈ రొట్టెను తిని, యీ పాత్రలోనిది త్రాగు నప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు" (1 కొరింథీ. 11:26) అని వ్రాసాడు. క్రియాశీలకమైన విధానంలో దేవుని ప్రజల హృదయాలలో మరియు జీవితాలలో గతము ప్రస్తుతము అవుతుంది; మనము నిరీక్షణతో మరియు మన ప్రభువు యొక్క భవిష్యత్తు రాకడ ఆశతో జీవించుటకునూ మరియు నిత్య జీవమునకు మన పునరుత్థానమునకును ఇది మనలను మలిచి ఆకారముగా రూపుదిద్దుతుంది.

---

సూచనలు

[1]Bruce K. Waltke, *Genesis: A Commentary* (Grand Rapids, Mich.: Zondervan Publishers, 2001), 317. [2]Jeffries M. Hamilton, "Kiriath-arba," in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 4:84. [3]Philip S. Johnston, "Burial and Mourning," in *Dictionary of the Old Testament: Pentateuch*, ed. T. Desmond Alexander and David W. Baker (Downers Grove, Ill.: InterVarsity Press, 2003), 105. విలాపమునిమిత్తము పొడిగించబడిన సమయములు తరువాత కాలంలో ప్రధానమైన నాయకులకు ఉపయోగించేవారు: యోసేపు (డెబ్బది దినములు; 50:3), అహరోను (ముప్పై దినములు, సంఖ్యా. 20:29), మరియు మోషే (ముప్పై దినములు; ద్వితీ. 34:8). [4]John Bright, *The History of Israel*, 3d ed. (Philadelphia: Westminster Press, 1981), 115. [5]Nahum M. Sarna, *Genesis*, The JPS Torah Commentary (Philadelphia: Jewish Publication Society, 1989), 396. [6]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 18—50*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995), 128. హెబ్రోనులో ఉన్న హిత్తీయులకును మరియు అనతోలియాలో ఉన్న హిత్తీయులకును మధ్యగల సంబంధములకు ఊతనిచ్చే వాదనల కొరకు, Hamilton, 127–28 చూడండి. [7]పాతనిబంధన హెబ్రీ భాష లిఖితపూర్వకమైన ఎట్టి అచ్చులు లేదా అచ్చు బిందువులు లేక కేవలం ఇరువది-రెండు హల్లులను మాత్రమే కలిగినది గనుక NIV అనువాదము యొక్క కొన్ని అచ్చులలోని కొన్ని సూచనలు 23వ అధ్యాయం ఆద్యంతం "హిత్తీయుడు" (Hittite) అనే మాటకు "హెతీతుడు" (Hethite) అనేప్రత్యామ్నాయ పదాన్ని సూచిస్తుంది. [8]Gordon J. Wenham, *Genesis 16—50*, Word Biblical Commentary, vol. 2 (Dallas: Word Books, 1994), 126. [9]Harry A. Hoffner, Jr., "Hittites," in *Peoples of the Old Testament World*, ed. Alfred J. Hoerth, Gerald I. Mattingly, and Edwin M. Yamauchi (Grand Rapids, Mich.: Baker Books, 1994), 152–54. [10]కనాను దేశమును స్వతంత్రించుకున్న

తరువాత ఇదే పదములు ఇశ్రాయేలీయులకొరకు ఉపయోగించబడ్డాయి. వారి హోదా ఇంకను దేవుని దేశంలో జీవిస్తున్న "పరదేశులు/అన్యులు" మరియు "సంచారకులు/కౌలుదారులు" గానే ఉండిపోయింది (లేవీ. 25:23; 1 దిన. 29:15; కీర్తన. 39:12).

[11]హెబ్రీలో ఈ విధంగా చెప్పవచ్చును కాని, ASV అక్షర అర్థమును ఇస్తుంది: "దేవుని యొక్క యువరాజు" అని. [12]"మక్పేలా" అనే పేరు అది "ద్వంద్వ-గుహ" అని లేదా "చీలిన గుహ" అని సూచిస్తుంది. (Ludwig Koehler and Walter Baumgartner, *The Hebrew and Aramaic Lexicon of the Old Testament*, study ed., trans. and ed. M. E. J. Richardson [Boston: Brill, 2001], 1:581.) మరణించిన వారిని తొలచబడిన బండలలో లేదా గుహలుగా ఉన్న సమాధులలో సమాధిచేయడం ఆనవాయితీ, ఇది ఒక కుటుంబమును అనేక తరముల వరకు పనికొస్తుంది. [13]See Albrecht Goetze, trans., "The Hittite Laws," in *Ancient Near Eastern Texts: Relating to the Old Testament*, 3d ed., ed. James B. Pritchard (Princeton, N.J.: Princeton University Press, 1969), 191 (nos. 46, 47). [14]See Manfred R. Lehmann, "Abraham's Purchase of Machpelah and Hittite Law," *Bulletin of the American Schools of Oriental Research* 129 (February 1953): 15–18. [15]వెండి నాణెములు అనునవి చాల తరువాతి కాలపు పురోగతి; కాబట్టి, నాలుగు వందల షెకెలుల (తులముల) విలువ అంటేషెకెలును బరువుతో కొలుచుట అన్నమాట. [16]Sarna, 160. [17]Alfred J. Hoerth, *Archaeology and the Old Testament* (Grand Rapids, Mich.: Baker Books, 1998), 105–6. [18]"హిత్తీయుల వ్యాపార దస్తావేజులలో ఉన్న లక్షణమైన గురుతు ఏమనగా ప్రతి ఒక్క భూమి అమ్ముడయ్యేటప్పుడు వృక్షముల యొక్క ఖచ్చితమైన అంకెను విధిగా వ్రాసుకోవడం" అని Manfred R. Lehmann చెప్పాడు. (Lehmann, 18.) [19]*qum* అనే క్రియా రూపము అక్షరాలా "నిలబడుట" లేదా "లేచుట" అనే అర్థాన్ని ఇస్తుంది, మరియు ఇది ఈ అధ్యాయము ఆరంభంలో రెండుసార్లు వచ్చింది (23:3, 7). 23:17, 20లో KJV అనువాదం "ధ్రువీకరించుకొను" అని ఉంది. ఈ పదము ఈ కథనమును పేరు చేస్తుంది. [20]Mishnah *Pesahim* 10.5.

[21]దహన బలులు అనునవి ప్రజలు పాపములకు క్షమాపణ పొందులాగున అర్పించబడే పరిహార్థ అర్పణలు (లేవీ. 1:3–5; 4:13–21).